

సాక్షి విశాఖపట్నం
గురువారం । 20 । మార్చి । 2025



హే పిచ్చుక.. తిరిగి రావాలిక.! 8లో



ఆ రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు 8లో




# అభివృద్ధిని విస్మరించి బరితెగింపు




వైఎస్సార్ పేరు లేకుండా ఉన్న ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం

- విశాఖ స్టేడియం పేరు మార్పుపై వైఎస్సార్ అభిమానుల ఆగ్రహం
- వెంటనే జతచేయాలని డిమాండ్

**దాబాగార్డెన్స్/మధురవాడ/కొమ్మాది/తగరపువలస:** మంచితనానికి మారుపేరు.. మానవత్వానికి ప్రతిరూపం.. చిరునవ్వుకు చిరునామా.. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన పేరును పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నుంచి కూటమి ప్రభుత్వం తొలగించింది. ఇది పూర్తిగా కక్షపూరిత చర్యేనని క్రీడాకారులు, క్రీడాభిమానులు, వైఎస్సార్ అభిమానులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. విశాఖ నగర అభివృద్ధికి వైఎస్సార్ చేసిన కృషి ఎనలేనిది. మధురవాడ నేడు అభివృద్ధిలో దూసుకుపోతుందంటే అందుకు ప్రధాన కారణం వైఎస్సార్. ఈ క్రికెట్ స్టేడియానికి అంతర్జాతీయ హోదా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. అలాంటి గొప్ప నాయకుడి పేరును రాత్రికి రాత్రే తొలగించడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్ అభిమానులు మండిపడుతున్నారు. **అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నేతలు బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ వ్యూ పాయింట్‌ను** ధ్వంసం చేశారు. నగరంలో పలు చోట్ల ఆయన విగ్రహాలను తొలగించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరు లేకుండా చేశారు. ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పేరును మార్చి వికృతానందం పొందుతున్నారు.

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి, విశాఖకు చేసిన సేవలకు గుర్తింపుగా 2009 సెప్టెంబర్ 14న అప్పటి ఏసీఏ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంగా పేరు పెట్టారు. ఆనాడు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జీవీఎంసీ కౌన్సిల్‌లో సభ్యులందరి అభిప్రాయం మేరకు తీర్మానం చేసి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పుడు జీవీఎంసీ కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా, సభ్యులకు కనీసం తెలియజేయకుండా స్టేడియం పేరును ఎలా తొలగిస్తారంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చకు పట్టుబడతామని పలువురు కార్పొరేటర్లు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కేవలం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. వెంటనే వైఎస్సార్ పేరును స్టేడియంకు జత చేయాలని డిమాండ్ చేశారు.

## విశాఖపై వైఎస్సార్ ముద్ర

నగరంలో మంచినీటి సమస్య పరిష్కారం, నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించి రెండో దశను విస్తరించడం, భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్(బీహెచ్‌పీవీ)ని భెల్‌లో విలీనం చేయడం, షిప్‌యార్డును రక్షణ శాఖలో విలీనం చేసి పునరుజ్జీవం కల్పించడం. ఇలా ఎన్నో ప్రధాన సమస్యలను పరిష్కారం చూపిన దార్శనికుడు వైఎస్సార్. ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా విశాఖలో ఐటీ సెజ్‌కు శ్రీకారం చుట్టారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను 2005 నవంబర్ 22న మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)గా గ్రేటర్ హోదాని కల్పించారు. ఆయన చొరవతోనే జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో భాగంగా రూ.1885 కోట్ల విలువైన పనులు విశాఖ నగరానికి దక్కాయి. సెంట్రల్ సిటీలో రూ.244 కోట్లతో 750 కిమీ మేర యూజీడీ పనులు చేపట్టారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు హైదరాబాద్ నిమ్స్ తరహాలో అత్యుత్తమ సేవలు అందించేందుకు విమ్స్‌కు 2006లో శ్రీకారం చుట్టారు. ఉత్తరాంధ్ర తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చాలన్న సంకల్పంతోనే పోలవరం ఎడమ కాలువను నిర్మించారు. ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్ విస్తరణకూ రాజశేఖరరెడ్డి పునాదులు వేశారు. ఎండాడ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.23 కోట్లు.. విశాఖ నగర దాహార్తిని తీర్చేందుకు తాటిపూడి నుంచి నగరానికి రూ.95 కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆశీల్‌మెట్ట నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.87 కోట్లతో నగరంలో తొలి ఫ్లైఓవర్ నిర్మించారు. పట్టణ పేదలకు గృహయోగం కల్పించారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నో.. ఇంకెన్నో..

### వైఎస్సార్ పేరు సముచితం



పీఎంపాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియానికి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. స్టేడియం బాగా అభివృద్ధి చెందుతోంది. ఇలాంటి సమయంలో వివాదాలకు అవకాశం ఇవ్వడం సరికాదు. వైఎస్సార్ విశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అలాంటి వ్యక్తి పేరు క్రికెట్ స్టేడియానికి పెట్టడం సముచితం. ఇప్పుడు దానిని తొలగించడం సరికాదు. పాలక వర్గం ఆలోచించి వైఎస్సార్ పేరును తిరిగి చేర్చాలి.

– మచ్చా దుర్గా ప్రసాద్, క్రికెట్ క్రీడాకారుడు, మధురవాడ

### రాజకీయం చేయడం తగదు



వైఎస్సార్ 2009లో చనిపోయిన 3వ రోజునే ఈ స్టేడియానికి ఆయన పేరు పెట్టాలని పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. అదే తరుణంలో విశాఖ వచ్చిన ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్‌ను విశాఖ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు రవిరాజ్ ఆధ్వర్యంలో మేమంతా కలిసి వినతి పత్రం ఇచ్చాం. దీంతో అప్పుడు ఏసీఏ వీడీసీఏ స్టేడియంగా ఉన్న దీనికి వైఎస్సార్ పేరు జతచేశారు. వైఎస్సార్ అన్ని వర్గాల మనిషి.

– వంకాయల మారుతీ ప్రసాద్, క్రీడాకారుడు

### ఎన్టీఆర్ పేరును జిల్లాకు పెట్టిన ఘనత జగన్‌ది



గత ప్రభుత్వ హయాంలో రాజకీయాలతో సంబంధం లేకుండా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరు కృష్ణా జిల్లాకు పెట్టి ఆయన్ని మరో మెట్టు ఎక్కించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. కూటమి ప్రభుత్వం జగన్‌కు భయపడుతున్నట్టు అర్థమవుతోంది. చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయితే.. వైఎస్సార్ సంక్షేమ ప్రధాత. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి.

–బి.హరికిరణ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

### మరీ ఇంత దుర్మార్గమా.?



ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు తొలగించడం దుర్మార్గపు చర్య. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తోంది. ఏ అభివృద్ధి, సంక్షేమం లేదు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు నీచ రాజకీయాలు చేస్తున్నారు. క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరు తొలగింపుపై కూటమి ప్రభుత్వం స్పందించాలి. యథావిధిగా మహానేత పేరును కొనసాగించాలి.

– దౌలపల్లి కొండబాబు, కార్పొరేటర్

### వైఎస్సార్ పేరు తొలగింపు బాధాకరం



రాష్ట్రాన్ని, మరీ ముఖ్యంగా విశాఖ మహానగరాన్ని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభివృద్ధి బాట పట్టించారు. ఆయన సేవలకు గుర్తుగా క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు పెట్టారు. ఇప్పుడు ఆ పేరును తొలగించడం బాధాకరం. కూటమి ప్రభుత్వం బరితెగించిందనడానికి ఇదే నిదర్శనం. విశాఖలో బీచ్, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ వ్యూ పాయింట్లు ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వ చర్యలు బాధిస్తున్నాయి.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్, జీవీఎంసీ

### కూటమి చర్యలు సిగ్గుచేటు



క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరు రాత్రికి రాత్రే తొలగించడం దుర్మార్గం. మధురవాడ నేడు అభివృద్ధిలో ఉందంటే అక్కడ ఉన్న క్రికెట్ స్టేడియం కారణం. ఈ స్టేడియానికి అంతర్జాతీయ హోదా ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే. అంతటి మహానాయకుడి పేరును క్రికెట్ స్టేడియంనకు పెట్టాలని అందరూ ప్రతిపాదించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విశాఖలో వైఎస్సార్ గుర్తులు తుడిచేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇంతకన్నా సిగ్గు చేటు ఏముంటుంది?

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

### అప్పడలా.. ఇప్పడిలా?



2009 సెప్టెంబర్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ పేరును స్టేడియానికి పెట్టేందుకు అందరూ అంగీకరించారు. కౌన్సిల్ ఆమోదం పొందింది. అన్ని వర్గాల ప్రజలు సంతోషించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహానేత వైఎస్సార్ పేరు తొలగించాలని కంకణం కట్టుకున్నట్టుంది. కౌన్సిల్ దృష్టికి రాకుండా, సభ్యుల ఆమోదం తెలపకుండా పేరు ఎలా తొలగిస్తారు? ఈ విషయమై త్వరలో జరగబోవు కౌన్సిల్ సమావేశంలో చర్చకు పట్టుబడతాం.

– బానాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్

## న్యూస్‌రీల్

### పూర్తయిన నామినేషన్ల పర్వం

వివిధ పదవులకు 40 మంది పోటీ



గెలుపు కోసం ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

**విశాఖ లీగల్ :** విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. బుధవారం సాయంత్రం తుది జాబితా వివరాలను ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి సి.బి.ఎస్.లింగరాజు విలేకరులకు తెలిపారు. అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు ఎం.కె.శ్రీనివాస్, ఐ.ఎం.అహ్మద్, నమ్మి సన్యాసిరావులు పోటీలో ఉన్నారు. కీలకమైన కార్యదర్శి పదవికి ఎల్పీ నాయుడు, ఆర్.సూర్యనారాయణ, ఏవి సోమేశ్వరరావు, వి.వెంకట సుధాకర్ రావు పోటీ చేస్తున్నారు. మొత్తం 5000 మందికి పైగా న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 28 తేదీ ఉదయం ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు రాత్రి 9 గంటలకు ఫలితాలు ప్రకటిస్తారు.

### ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**విశాఖ స్పోర్ట్స్:** విశాఖలోని డా.వైఎస్‌ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ నెల 24, 30 తేదీల్లో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ బుధవారం సమీక్ష జరిపారు. వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతూ సమన్వయ లోపానికి తావీయకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల బస, రవాణా, బందోబస్తు తదితర ఏర్పాట్లపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రేక్షకులకు అసౌకర్యం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సమీక్షలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, డీసీపీలు, ఏసీపీ, ఢిల్లీ క్యాపిటల్స్, ఐపీఎల్ ప్రతినిధులతో పాటు జీవీఎంసీ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఆధార్ క్యాంపులు

**మహారాణిపేట :** ప్రత్యేక ఆధార్ క్యాంపులు నేటి నుంచి ఈనెల 22 వరకు, తిరిగి ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 121 గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు 20 కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ),13 పోస్టీఫీసుల్లోని ఆధార్ సేవా కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

### సాంకేతిక కారణాలతో ఆర్‌ఆర్‌బీ పరీక్ష రద్దు



ఆర్‌ఆర్‌బీ పరీక్ష రద్దుతో ఆందోళనలో అభ్యర్థులు

**పెందుర్తి:** ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆర్‌ఆర్‌బీ(లోకో పైలట్) అభ్యర్థులు పరీక్ష రద్దుతో తీవ్ర నిరాశ చెందారు. చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో బుధవారం జరగాల్సిన ఆన్‌లైన్ పరీక్ష ఆఖరి క్షణంలో రద్దయింది. పరీక్షకు అంతా సిద్ధమని తొలుత నిర్వాహకులు ప్రకటించారు. అభ్యర్థులు లోపలికి వెళ్లగానే సర్వర్ డౌన్.. క్షణాలు.. నిమిషాలు.. గంటలు గడుస్తున్నా ఆ సాంకేతిక సమస్య పరిష్కారం కాలేదు. రైల్వే సర్వర్ పనిచేయకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచిచూసిన నిర్వాహకులు పరీక్ష రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతే దాదాపు 1300 మంది అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. మళ్లీ ఎప్పుడు పరీక్ష ఉంటుందో నిర్వాహకుల నుంచి ఎలాంటి సమాచారం లేదు.

### 21న జాబ్‌మేళా

**కంచరపాలెం:** జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 21వ తేదీ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ తెలిపారు. శ్రీరామ్ చిట్స్ ఇండియా, ఎస్‌ఆర్ అకడమిక్ ఆర్గనైజేషన్ లిమిటెడ్ సంస్థల్లో 75 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఆఫీస్ అడ్మిన్, జీఎస్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, టెలీకాలర్, మార్కెటింగ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, బీఎస్సీ నర్సింగ్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆయా ఉద్యోగాలకు 18-40 సంవత్సరాల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. జాబ్‌మేళాకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యామ్ సుందర్ కోరారు.

## 'వైఎస్సార్' పేరు చూస్తే 'కూటమి'లో కలవరం

- ప్రతిచోటా ఆయన పేరును తొలగిస్తున్నారు
- ప్రజల గుండెల్లో మాత్రం ఆయన స్థానాన్ని చెరపలేరు
- విశాఖ స్టేడియానికి ఉన్న వైఎస్సార్ పేరు తొలగించడం దుర్మార్గం
- నేడు స్టేడియం వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన
- మీడియాతో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

**సాక్షి, విశాఖపట్నం :** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును చూసి టీడీపీ కూటమి సర్కారు కలవరపడుతోందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. రాష్ట్రంలో వైఎస్సార్ పేరు లేకుండా చేయాలనే దుర్మార్గమైన ఆలోచనతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ పేరు ఎక్కడ ఉంటే అక్కడ వరుసగా తొలగిస్తూ వస్తున్నారన్నారు. వైఎస్సార్ పేరు అయితే చెరిపేయగలరుగానీ.. ప్రపంచవ్యాప్తంగా అభిమానుల గుండెల్లో ఉన్న ఆ పేరును చెరిపేయగలరా అని ప్రశ్నించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీని లేకుండా చేయాలని.. వైఎస్సార్ అనే బ్రాండ్ కనిపించకుండా చేయాలన్న కుతంత్రమే కనిపిస్తోంది. నాగార్జున యూనివర్సిటీలోని వైఎస్సార్ విగ్రహాన్ని నేలమట్టం చేశారు.. బాపట్ల జిల్లా వేమూరులో వైఎస్సార్ విగ్రహానికి నిప్పంటించారు.. విజయవాడ హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరును తీసేశారు.. చివరికి అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఉన్న 'వైఎస్సార్' పేరునూ దుర్మార్గంగా తొలగించారు. అలాగే, వైఎస్ జగన్ సీఎంగా ఉండగా సీతకొండను అభివృద్ధిచేసి వైఎస్సార్ వ్యూ పాయింట్ అని పెడితే అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని కూడా తీసేశారు. అలాగే, వైఎస్సార్ జిల్లా పేరును మార్చేశారు. రైతుల పక్షపాతి అయిన వైఎస్సార్ పేరును రైతుభరోసా కేంద్రాలకు పెడితే, వాటినీ నిర్వీర్యం చేశారు. చివరికి.. విజయవాడ సమీపంలోని తాడిగడప మున్సిపాలిటీకి వున్న వైఎస్సార్ పేరును కూడా తొలగించారు.

### జగన్ పేరునూ తీసేశారు..

ఇక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా విజయవాడ నడిబొడ్డున 150 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియం నిర్మిస్తే దానిపైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తీసేశారు. వైఎస్సార్ పేరు కనపడితేనే ఓర్చుకోలేకపోతున్న చంద్రబాబు.. గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేసి కూడా కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు ఎందుకు పెట్టలేకపోయారు? వైఎస్ జగన్ సీఎం అయ్యాకే ఎన్టీఆర్‌కు సమున్నత గౌరవం కల్పించారు. ఇక విశాఖ వీడీసీఏ క్రికెట్ స్టేడియానికున్న వైఎస్సార్ పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉ.10 గంటలకు స్టేడియం వద్ద శాంతియుతంగా నిరసన చేపడతాం. ఈ నెలాఖరున ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నందున ప్రభుత్వం, ఏసీఏ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని వైఎస్సార్ పేరును కొనసాగించాలి.

## బడ్జెట్ ప్రత్యేక సమావేశంపై కలెక్టర్‌కు వినతి

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ బడ్జెట్ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించినట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఏర్పాటుకు ఈ నెల 15న కలెక్టర్‌కు వినతి పత్రం అందించామన్నారు. ఇప్పటి వరకు ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. ఈ నెల 22, 29 తేదీల్లో శాసన సభకు, పార్లమెంట్‌కు సెలవు ఉన్నందున ఎమ్మెల్యేలు, ఎంపీలు నగరంలోనే ఉంటారని, ఆ సమయంలో కలెక్టర్ చొరవ తీసుకుని జీవీఎంసీ బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

## ఈకేవైసీ గడువు ఈనెల 31

**మహారాణిపేట:** జిల్లాలో రైస్‌కార్డుదారులందరూ ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలో 15,91,448 మంది కార్డుదారుల సభ్యులు ఉండగా, ఇప్పటివరకు 14,26,463 మంది సభ్యుల ఈకేవైసీ పూర్తయిందని, ఇంకా 1,64,985 మంది సభ్యుల ఈకేవైసీ ప్రక్రియ జరగలేదని పేర్కొన్నారు. ఈకేవైసీ కోసం సచివాలయంలో వీఆర్‌వోను సంప్రదించాలని కోరారు.

## చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, ఇతర అధికారులు

**మహారాణిపేట :** సింహగిరిపై ఏప్రిల్ 30వ తేదీన జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఆ రోజు తెల్లవారుజాము 3.30 నుంచి 4.30 గంటల వరకు మాత్రమే అనువంశిక ధర్మకర్త, తితిదే నుంచి పట్టు వస్త్రాలు సమర్పించేవారికి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. 29వ తేదీ రాత్రి 6 గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, ఇతర ఏడీసీపీలు, దేవదాయ శాఖ అధికారులు, ఈవో కె.సుబ్బారావు, డీఆర్వో బి.హెచ్.భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగర పరిధిలోని అనుకూల ప్రాంతాల్లో టికెట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి.. రూ.1500, రూ.1,000, రూ.300 టికెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. రూ.1,500 టికెట్లు కొనుగోలు చేసిన వారికి మాత్రమే నీలాద్రి గుమ్మం వద్ద నుంచి దర్శనానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు. హనుమంతవాక వైపు నుంచి పాత గోశాల వరకు, అక్కడ నుంచి అడవివరం వరకు రెండు పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని.. అవసరం మేరకు హనుమంతవాక వైపు, అడవివరం వైపు వీలైనన్ని పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు. తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విరివిగా తాగునీటి కేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, వైద్య శిబిరాలను పెట్టాలన్నారు. మరుగుదొడ్లు ఇతర వసతులు సమకూర్చాలని చెప్పారు. పరిమిత సంఖ్యలో వెహికల్ పాస్లు జారీ చేయాలని చెప్పారు. ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించరాదని స్పష్టం చేశారు.

**అదనపు పార్కింగ్ ప్రదేశం, పోలీస్ ఔట్ పోస్టుపై సూచన**

సింహాచలం కొండపై అదనపు పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేయడంతోపాటు శాశ్వత పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేయగా సంబంధిత చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అనుసంధానం చేస్తూ.. సెంట్రలైజ్డ్ పబ్లిక్ అడ్రస్ సిస్టం పెట్టాలని, కొండ, మెట్ల మార్గంలో విరివిగా మైక్ హారన్లు పెట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ బాగ్చి ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాల గుర్తింపు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో దేవదాయ, పోలీసు, జీవీఎంసీ, విద్యుత్, వైద్య, రవాణా, ఆర్టీసీ, రెవెన్యూ తదితర విభాగాల ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలి




వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నీతిఆయోగ్ సలహాదారు సంజీత్ సింగ్

ఎంఎస్‌ఎంఈ వర్క్‌షాప్‌లో నీతిఆయోగ్ సలహాదారు సంజీత్ సింగ్

**సాక్షి, విశాఖపట్నం:** చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని నీతిఆయోగ్ సీనియర్ సలహాదారు సంజీత్ సింగ్ అభిప్రాయపడ్డారు. నోవోటల్ హోటల్‌లో ఎంఎస్‌ఎంఈల సాధికారతపై సీఐఐ సహకారంతో ఏపీ ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్, నీతి ఆయోగ్ బుధవారం సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల మనుగడ నేపథ్యంలో ప్రతి విషయంలోనూ ప్రభుత్వాలు చేయూతనందించాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈల పరంగా విశాఖ జిల్లా ముందంజలో ఉందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో సీఐఐ ఎంఎస్‌ఎంఈ చైర్మన్ పొన్నుస్వామి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, అనకాపల్లి జిల్లా డీఐసీ జీఎం నాగరాజారావు, డీఐసీ సహాయ సంచాలకులు జోగినాథ్, సూపరింటెండెంట్ ఆర్‌ఆర్‌ఎస్ మహేష్, ఐపీవోలు హామిని, త్రివేణి, సునీత, జ్యోతితో పాటు సుమారు 300కి పైగా ఎంఎస్‌ఎంఈ హోల్డర్లు సదస్సుకు హాజరయ్యారు.

## తాగునీరు 'మహా' ప్రభో..





సన్నంగా నీటి ధార

వేసవి ఇంకా పూర్తిగా మొదలు కాక ముందే నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యంగా హెచ్.బి.కాలనీలోని శ్రీ లక్ష్మీ నరసింహనగర్ కాలనీలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడ బిందెడు నీటి కోసం మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కాలనీలో అనధికార కుళాయిలు పదుల సంఖ్యలో ఉండటంతో నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా కాలనీలోని ప్రతి ఇంటికి సరిగా నీరు అందడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై స్థానికులు ఇప్పటికే పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి ఉంటే.. రానున్న వేసవిలో ఇంకెంత కష్టం వస్తుందోనని వారు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పక్షుల కోసం ఏర్పాటు చేసే వరి కంకులతో నగర ప్రజలు, గ్రీన్‌క్లైమేట్ సభ్యులు



అంతరించిపోతున్న ప్రకృతి నేస్తాలు

సంరక్షించాల్సిన బాధ్యత మనదే..

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



పిచ్చుకలకు నీటి పాత్రలు ఏర్పాటు చేస్తున్న కృష్ణా కళాశాల విద్యార్థులు

# హే పిచ్చుక.. తిరిగి రావాలిక.!

**2025 థీమ్ ఇదే..**

ఏ ట్రిబ్యూట్ టూ నేచర్స్ టినీ మెసెంజర్స్.. ఈ థీమ్ పిచ్చుకల ప్రాముఖ్యతను, వాటిని సంరక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

ఏయూక్యాంపస్: స్వేచ్ఛకు, సంతోషానికి, ప్రకృతి అందానికి చిహ్నాలు పిచ్చుకలు. కానీ, వాటి గురించి ప్రస్తుత కాలం పిల్లలకు తెలుసో తెలియదో మరి!. ఒకప్పుడు మన పూరి గుడిసెల్లో, మనతోనే కలిసిమెలిసి జీవించేవి ఈ చిట్టి పక్షులు. మన కిటికీ పక్కనో.. పెరట్లోని చెట్టుపైనో వాటి కిచకిచలు వింటూ ఆనందంగా కళ్లు తెరిచిన రోజులు చాలానే ఉంటాయి. ఇప్పుడా గుడిసెలు లేవు.. వాటికి గూడు కట్టుకోవడానికి చోటూ లేదు.. ఫలితంగా పిచ్చుకలూ లేవు. కాలం మారింది. మన అవసరాలు పెరిగాయి. చిన్న గుడిసె స్థానంలో పెద్ద భవంతులు వచ్చాయి. మన ఆశలు పెరిగాయి. కానీ మనకు సహాయపడే ఇతర జీవులతో మన ఆత్మీయత తగ్గిపోయింది. మన అవసరాల కోసం వాటిని అంతం చేస్తున్నాం. ఏటా మార్చి 20న మనం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటున్నాం. అంతరించిపోతున్న ఈ పక్షుల గురించి తెలుసుకోవడం, వాటిని కాపాడుకోవడం మన బాధ్యత.

పిచ్చుకలు చూడ్డానికి బుల్లి పిట్టలే కానీ.. పర్యావరణ వ్యవస్థలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి. బుజ్జి బుజ్జి ముక్కులతో కీటకాలను తినేసి.. మొక్కలను తెగుళ్లు, చీడ పీడల నుంచి కాపాడతాయి. విత్తనాలను వ్యాప్తి చేస్తాయి. ఇవి ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు వెళ్లే సమయంలో పరోక్షంగా పరాగ సంపర్కం జరగడానికి దోహదపడతాయి. ఇలా ఎన్నో ఏళ్లుగా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో **ముఖ్యపాత్ర పోషిస్తున్న పిచ్చుకల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది.** ప్రస్తు**తం ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాల్లో ఇవి** కనిపిం**చడం లేదు. న**గరీకరణ, **పట్టణ,** గ్రామీణ **ప్రాంతాల్లో** విపరీతంగా **చెట్లను** నరికివే**యడం, ఎక్కడ** బడితే **అక్కడ సెల్ టవర్ల** నిర్మాణం **తదితర కారణాలు** పిచ్చుకల **పాలిట పెద్ద ముప్పుగా** మారాయి. **పంట పొలాల్లో పురుగు మం**దుల వాడక**ం, ఆహారం లభించకపోవడం, గూడు కట్టుకోవడానికి** స**రైన ప్రదేశాలు లేకపోవడం వంటి కారణాల** వల్ల వాటి **మనుగడ కష్టతరమవుతోంది. ఇళ్లలో మొక్కలు** పెంచే సంస్కృ**తి తగ్గిపోవడం కూడా మరో కారణం.**

**ప్రతిజ్ఞ చేద్దాం**

ఈ ప్రప**ంచ పిచ్చుకల** దినోత్సవం సందర్భంగా మనం ఒక ప్రతిజ్ఞ చేద్దాం. మన వంతుగా పిచ్చుకలను కాపాడుకుందాం. బాల్కనీల్లో, ఇంటి పెరడులో వాటి **కోసం కాసిన్ని నీళ్లు పెడదాం. బర్డ్ ఫీడర్‌ను ఉంచి వాటిల్లో కొన్ని బియ్యం గింజలు, లేదంటే మనకు అందుబాటులో ఉన్న** ఇతర తృణ ధాన్యాలను వాటికి ఆహారంగా అంది**ద్దాం.** హే పిచ్చుక.. గూడు కట్టుకో.. **అని** ఆహ్వానిద్దాం! తద్వారా మన **భవిష్యత్** తరాలకు ఈ అందమైన పక్షులను పరి**చయం చేద్దాం.**



ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## పిచ్చుకల సేవలో..

నగరంలోని గ్రీన్‌క్లైమేట్ సంస్థ 15 ఏళ్లుగా పిచ్చుకల సంరక్షణపై పనిచేస్తోంది. ఇప్పటి వరకు 2.8లక్షల పిచ్చుక గూళ్లను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తెలిపారు. పక్షుల కోసం ప్రత్యేకంగా 6 లక్షల మట్టి పాత్రలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏటా 5 వేల ధాన్యం కుచ్చులను సేకరించి వివిధ ప్రాంతాల్లో ఉంచుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది **10 వేల పిచ్చుక**ల గూళ్లు, లక్ష మట్టి పాత్రలు పక్షులకు, జంతువులకు ఉపయుక్తంగా ఏర్పాటు చేయడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

### ధాన్యం కుచ్చులను ఏర్పాటు చేశాం



పిచ్చుకలు మా ఇంటిని నిత్యం వస్తుంటాయి. వీటి కోసం ప్రత్యేకంగా వరి కంకులను కుచ్చులుగా కట్టించి ఇంట్లో ఏర్పాటు చేశాం. వీటి నుంచి గింజలను తీసుకుని ఆహారంగా స్వీకరిస్తాయి. ఇవి ఇంటికి వస్తే ఎంతో సందడిగా, సంతోషంగా ఉంటుంది. వరి కుచ్చులను ఇళ్లలో వేలాడదీయని స్నేహితులకు కూడా ఇస్తుంటాను.

– టి.వెంకట సుబ్బారావు, ఎంవీపీ కాలనీ

### ఆహారం, నీరు అందిస్తాం



నిత్యం మా ఇంటి బాల్కనీలోకి పిచ్చుకలతో పాటు పాల పిట్టలు వస్తుంటాయి. వీటికి ఆహారం కోసం వరి ధాన్యం, గంట్లు వంటివి అందిస్తాం. వేసవిలో తప్పనిసరిగా ఒక పాత్రలో నీరు పెట్టి.. వాటి దాహార్తి తీర్చే ప్రయత్నం చేస్తాను. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పిస్తుంటాను.

– తిరుమల శ్రీదేవి, టీచర్



కృష్ణా కళాశాల విద్యార్థులతో గ్రీన్‌క్లైమేట్ బృంద సభ్యులు, అధ్యాపకులు

## పిచ్చుకలకు తోడుగా..

మద్దిలపాలెం: మన ఇంటికి వచ్చే పిచ్చుకలను మనమే కాపాడుకుందామని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు పిచ్చుకల గూళ్లు, మంచి నీటి పాత్రలు ఏర్పాటు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వేసవి**లో** పక్షుల కోసం నీరు అందుబాటులో **ఉం**చాలని సూచించారు. ఇంటి ముందు **బియ్యం** పిండితో ముగ్గులు వేయాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే జీవకోటి మనుగడ సాధ్యమన్నారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ 15 **ఏళ్లుగా పిచ్చుకలకు** గూళ్లు, ఇతర పక్షులు, వన్య ప్రాణుల కోసం మట్టి పాత్రలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, బోటనీ హెడ్ ఎస్.పద్మావతి, టీచింగ్ ఫ్యాకల్టీ ఎం.హెచ్.డి పద్మావతి, స్వామినాయుడు, గ్రీన్ వలంటీర్లు పాల్గొన్నారు.

# సింహగిరిపై అభివృద్ధి పనుల పరిశీలన

**ఏప్రిల్ 10 నాటికి 'ప్రసాద్' పూర్తికి కలెక్టర్ ఆదేశం**



చందనోత్సవ ఏర్పాట్లపై ముందస్తు పరిశీలన చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో రూ.54 కోట్లతో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను ఏప్రిల్ 10 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 30న సింహగిరిపై జరిగే చందనోత్సవానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ ముందస్తు పరిశీలన చేశారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ అధికారులు ఆయా ఏర్పాట్లను ఆయనకు వివరించారు. ఈ క్రమంలో సింహగిరిపై ఉన్న క్యూలు, నిత్యాన్నదాన ప్రసాద భవనం, ప్రసాదాల తయారీ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే ప్రసాద్ పథకంలో భాగంగా జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్, క్యూ కాంప్లెక్స్, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, పార్కుల అభివృద్ధి, కల్యాణ మండపం, బస్టాండ్ ఆధునికీకరణ తదితర పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా చేసి రానున్న చందనోత్సవం నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రెల్లి కులస్తులకు అన్యాయం

డాబాగార్డెన్స్: రెల్లి కులస్తులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని రాష్ట్ర రెల్లి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావులు ఆరోపించారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో కూటమి ప్రభుత్వం రెల్లి కులస్తులను విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల జనాభా ఉన్న రెల్లి కులస్తులకు కనీసం 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమకు అన్యాయం చేయడం సరికాదని సీఎం చంద్రబాబును, డీసీఎం పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. 70 ఏళ్లుగా ఎస్సీల్లో రెండు కులాలే ప్రభావితం చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గురువారం నుంచి ఆందోళన తెలిపేందుకు పలువురు సభ్యులతో జేఏసీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఆ రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

**ఈ నెల 24, 30న ఐపీఎల్ మ్యాచ్‌లు**

విశాఖ సిటీ: విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 24న ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య, 30న ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లకు 28 వేల మంది ప్రేక్షకులు వచ్చే అవకాశాలు ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

**శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనచోదకులు**

- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు శొంఠ్యాం, పెందుర్తి, ఎన్ఏడీ మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు తాటిచెట్లపాలెం, ఎన్ఏడీ, పెందుర్తి, శొంఠ్యాం మీదుగా ప్రయాణించాలి.
- ఇతర చిన్న వాహనాలు మారికవలస వద్ద ఎడమ వైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరుకుని కుడివైపు తిరిగి బీచ్ రోడ్డులో రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్లాలి.
- కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు కార్‌షెడ్ ముందు ఉన్న పెప్సీ కటింగ్ నుంచి మిథిలాపురి కాలనీ మీదుగా ఎంవీపీ సిటీ వెనుకగా వెళ్లాలి. తర్వాత లా కాలేజీ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్–16కు చేరుకుని నగరంలోకి వెళ్లాలి. లేదా లా కాలేజ్ రోడ్డు నుంచి పనోరమ హిల్స్, రుషికొండ మీదుగా నగరంలోకి ప్రయాణించాలి.

**నగరం నుంచి వచ్చే వాహనచోదకులు..**

- నగరంలో నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక వద్ద ఎడమ వైపు తిరిగి ఆరిలోవ బీఆర్టీఎస్ రోడ్డులో ప్రయాణించాలి. అడవివరం వద్ద కుడివైపు తిరిగి నీలకుండీలు జంక్షన్ మీదుగా హైవేకు చేరుకుని ఆనందపురం మీదుగా ముందుకు సాగాలి.
- కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు హనుమంతవాక జంక్షన్ నుంచి ఎడమవైపు తిరిగి అడవివరం మీదుగా ఆనందపురం వెళ్లాలి. లేదా హనుమంతవాక జంక్షన్ లేదా విశాఖ వ్యాలీ జంక్షన్ లేదా ఎండాడ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి బీచ్ రోడ్‌లో తిమ్మాపురం వద్ద ఎడమవైపు తిరిగి మారికవలస వద్ద జాతీయ రహదారికి చేరుకుని ప్రయాణించాలి.

**మ్యాచ్‌కు వచ్చే వాహనచోదకులు**

- విశాఖ నుంచి స్టేడియం వైపునకు వచ్చే వీవీఐపీ, వీఐపీ పాసులు ఉన్న వాహనచోదకులు జాతీయ రహదారిలో స్టేడియంకు రావాలి. వీవీఐపీ వాహనాలు(ఏ గ్రౌండ్ పీ1 స్టేడియం లోపల), వీఐపీ వాహనాలను బీ గ్రౌండ్‌లో పీ2, వీ కన్వెన్షన్‌లో పీ3 పాసుల ప్రకారం చేరుకుని వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- నగరం నుంచి స్టేడియంకు వచ్చేవారు స్టేడియంకు ముందు ఓల్డేజ్ హోం జంక్షన్ వద్ద ఎడమవైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో(పీ–4) పార్కింగ్ చేసుకోవాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే వారు కార్ షెడ్ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి సాంకేతిక కాలేజ్ పార్కింగ్ గ్రౌండ్(పీ–4) చేరుకోవాలి.
- విజయనగరం నుంచి వచ్చే వాహనచోదకులు కార్‌షెడ్ జంక్షన్ ముందు ఉన్న పెప్సీ కటింగ్ నుంచి ఎడమ వైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్(పీ–6), ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డు (పీ–7)లో పార్కింగ్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలను జీవీఎంసీ పార్క్(పీ–8), కల్యాణ్ కుమార్ సైట్ (పీ–9)లో నిలపాలి.
- నగరం లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియంకు వచ్చే వారు ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డు (పీ–7)లో పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి వచ్చే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు జాతీయ రహదారిపైకి రాకుండా బీచ్ రోడ్‌లో వచ్చి ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డు (పీ–11)లో పార్కింగ్ చేయాలి.
- శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి తిమ్మాపురం రోడ్డు మీదుగా వచ్చి జురాంగ్ జంక్షన్ వద్ద కుడివైపుకు తిరిగి లా కాలేజ్ (పీ–11) వద్దకు చేరుకోవాలి.
- మ్యాచ్ అనంతరం సాంకేతిక కాలేజ్ పార్కింగ్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకున్న వారు తిరిగి వెళ్లేటపుడు విజేత సూపర్ మార్కెట్, కార్‌షెడ్ మీదుగా ప్రయాణించాలి. నగరంలోకి వెళ్లే వారు ఓల్డేజ్ హోం జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి ఎండాడ మీదుగా నగరంలోకి వెళ్లాలి.



## ఉక్కు రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ స్కీం సర్క్యులర్లు జారీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ ఉద్యోగులకు సంబంధించిన గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ (జీఎంఐఎస్), పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీం(పీఆర్ఎంఎస్)కు చెందిన సర్క్యులర్లను యాజమాన్యం బుధవారం విడుదల చేసింది. ఇటీవల యాజమాన్యం ఈ రెండు స్కీంలకు సంబంధించి మార్పులు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఆ మార్పులు రిటైర్డ్ ఉద్యోగులకు భారంగా ఉండటంతో కార్మిక సంఘాలు, అధికారుల సంఘం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు యాజమాన్యాన్ని కలిసి పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించి పాత పద్ధతిలో జీఎంఐఎస్ కోసం ఒకరికి రూ.1300, పీఆర్ఎంఎస్ కోసం ఒకరికి రూ.వెయ్యి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 27లోగా పేమెంట్ పూర్తి చేయాల్సి ఉంది. పూర్తి వివరాలకు రిటైర్డ్ ఎంప్లాయిస్ పోర్టల్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

## ఏయూ ఆచార్యులకు పేటెంట్ మంజూరు



ఆచార్యులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: బయో యాక్టివ్ ఫీడ్ యాడిటివ్ ఫర్ కంట్రోలింగ్ విబ్రియో ఇన్ఫెక్షన్స్ ఇన్ క్రస్టేషియన్స్ అంశంపై ఏయూలోని మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ప్రొఫెసర్ పి.జానకి రామ్, డాక్టర్ సునీల్‌కుమార్‌లకు సంయుక్తంగా భారత ప్రభుత్వ పేటెంట్ మంజూరయింది. రొయ్యల పరిశ్రమలో వచ్చే వ్యాధులకు సంబంధించిన నూతన ఔషధాన్ని అభివృద్ధి చేసిన విధానానికి గాను వీరికి పేటెంట్ దక్కింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ధనంజయరావు, ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజులు పేటెంట్ సాధించిన ఆచార్యులను అభినందించారు.

## ఈఏపీసెట్, పాలిసెట్‌లకు ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ: ఏపీఈఏపీసెట్, ఏపీ పాలిసెట్‌లకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. పోర్టు స్టేడియం దరి శ్రీ సాయి సౌధ మందిర్, ఎస్‌జీజీటీఎస్ కాలనీ వేదికగా ఈ శిక్షణ అందించనున్నారు. వివరాలకు 92480 52173, 96668 08446 నంబర్లను సంప్రదించవచ్చు.

## డివిజన్ లీగ్ విజేత మెజిస్టిక్ సీసీ



విజేత మెజిస్టిక్ సీసీ జట్టు సభ్యులు



హేమచందర్, ధీరజ్

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ నాల్గవ డివిజన్ క్లబ్స్ లీగ్ విజేతగా మెజిస్టిక్ సీసీ నిలిచింది. సీజన్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయంతో 28 పాయింట్లు సాధించి సత్తా చాటింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన మెజిస్టిక్ సీసీ 184 పరుగులకు ఆలౌటైంది. ధీరజ్ 55 పరుగులు చేశాడు. ప్రతిగా గౌరీ యూత్ సీసీ 32 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. హేమచంద్ర నాలుగు వికెట్లు తీసి జట్టుకు విజయాన్నందించాడు.

## మోసం కేసులో తపాలా శాఖ ఉద్యోగికి జైలు

విశాఖ లీగల్: వినియోగదారులను మోసం చేసిన తపాలా శాఖ ఉద్యోగికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20,000 జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ప్రదీప్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలుపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు వి.వి. రమణమూర్తి 2019లో కురుపాం మార్కెట్ దగ్గర గల తపాలా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో పలువురు వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేరడానికి రూ. 51,000 వేలు చెల్లించారు. రమణమూర్తి వారికి పాసు బుక్కులు జారీ చేశారు. కానీ ఆ డబ్బు తపాలా కార్యాలయంలో జమ చేయలేదు. దీనిపై కె.శ్యామసుందర్ అనే వ్యక్తి తపాలా కార్యాలయం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేపట్టి రమణమూర్తి వినియోగదారుల నుంచి డబ్బులు స్వాహా చేసినట్లు గుర్తించారు. సదరు విషయాన్ని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

## బాలికపై అసభ్యకర ప్రవర్తన.. వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి బి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.2,000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలివి.. నిందితుడు జి.గౌరీశంకర్ (45) గాజువాక సుధా మెడికల్ దగ్గర ఉంటున్నాడు. ఆ ఇంటి పక్కనే బాలిక కుటుంబ సభ్యులతో ఉంటోంది. కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం బాలిక గోడ పక్కకు వచ్చింది. దీన్ని అదునుగా తీసుకుని నిందితుడు బాలిక పక్కకు వచ్చి.. ఆమె వ్యక్తిగత భాగాలపై చేయి వేశాడు. దీంతో బాలిక అరవడంతో ఆమె తండ్రి, చుట్టు పక్కల వారు దగ్గరకు వచ్చారు. వెంటనే ఆమె తండ్రి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ జరిపిన పోలీస్ అధికారులు నిందితులపై పోక్సో చట్టం సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

## ప్రేమ పేరుతో మోసం.. యువకుడిపై పోక్సో కేసు

సీతమ్మధార: ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన కేసులో యువకుడిపై బుధవారం ఫోర్త్ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలిక (17) ఒక దంత వైద్యశాలలో పని చేస్తోంది. అదే ప్రాంతంలోని ఎస్.కె.ఎం.ఎల్ స్వీట్ షాపులో పని చేస్తున్న సత్యనారాయణ(అలియాస్ సత్య) అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడి.. ప్రేమకు దారి తీసింది. ఎప్పటిలాగే ఈ నెల 15న ఇంటి నుంచి పనికి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తమ కుమార్తె కనిపించలేదంటూ తల్లిదండ్రులు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బాలికను సత్యనారాయణ అపహరించినట్లు గుర్తించారు. కొద్ది రోజులు బాలికను శ్రీకాకుళంలో తన పిన్ని ఇంట్లో ఉంచాడు. తర్వాత విజయవాడకు తీసుకెళ్లాడు. పోలీసులు దర్యాప్తులో వారు విజయవాడలో ఉన్నట్లు తెలియడంతో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కేజీహెచ్‌లో చేర్పించారు. సత్యనారాయణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## చిన్న శ్రీను కుమారుడి మృతికి సంతాపం

ఆరిలోవ: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమారుడు బుధవారం ఆరిలోవ హెల్త్ సిటీ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకులు గొలగాని శ్రీనివాస్ తదితరులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. చిన్న శ్రీనును పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో విజయనగరం తరలించారు.

## హిందీ పరీక్షకు 74 మంది గైర్హాజరు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు, కేజీబీవీల రాష్ట్ర డైరక్టర్ డి.దేవానందరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. జిల్లాలోని ఐదు కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. బుధవారం నాటి హిందీ పరీక్షకు జిల్లాలో 28,376 మందికి గాను 28,302 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. పది కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ స్కూల్స్ టెన్త్ పరీక్షలకు 76 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

## ఏడు క్లౌడ్ కిచెన్లపై కేసుల నమోదు

బీచ్‌రోడ్డు: నగరంలో నిర్వహిస్తున్న క్లౌడ్ కిచెన్స్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం దాడులు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ అధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత పాటించని ఏడు క్లౌడ్ కిచెన్స్‌పై కేసులు నమోదు చేశారు. ఎంవీపీకాలనీలోని మెగా భోజనం, ఐవీస్ కిచెన్, అమర్ కిచెన్, పక్కా హైదరాబాదీ, రాజుల రుచులు, ఆంధ్ర బిర్యానీ హౌస్, హ్యాంగ్ అవుట్ బిర్యానీలపై కేసులు నమోదు చేసి ఆహార నమూనాలను స్వీకరించారు. క్లౌడ్ కిచెన్స్‌పై ఈ మధ్య కాలంలో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. ఆ నేపథ్యంలో తనిఖీలను నిర్వహించినట్లు నందాజీ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు పాల్గొన్నారు.